తలవని తలపు

శ్రీమతి డి. సరస్వతి

సాయంత్రం నాలుగున్నరయింది. మామూలుగా షికారు వెళ్ళడానికి ఆదరాబాదరా గుక్కెడు కాఫీ నీళ్ళు నోట్లోపోసుకొని గోపీఇంటికి బయల్దేరాడు రఘు. ఆనాడు గోపీ ఇంట్లో అంతా హడావుడిగా ఉంది. ఏమిటా - అని లోపల ప్రవేశించడంతోటే గోపీ యెదురై

"హల్లో ! రఘూ ! కమాన్, కమాన్" అంటూ ఆహ్వానించాడు.

"ఏమిటోయ్, ఈ వేళ అంతా హడావుడిగా ఉందే! "

"ఏమిలేదోయ్. ఈ వేళ మా చెల్లెన్ని చూడ్డానికి పెళ్ళివాళ్ళొస్తారు. నీవూ కూర్చో" అంటూండగా ఇంతలో "గోపీ" అన్న పిలుపువిని వెళ్ళిపోయాడు గోపీ;

ఐదుగంటలకల్లా వచ్చారు పెళ్ళివాళ్లు. వాళ్ళకి చేయాల్సిన సత్కారాలన్నీ ఏలోటు లేకుండా చేసారు రావుగారు. అంతాలోగిట్లో కూర్చొని కాస్త "పిచ్చాపాటీ" మాట్లాడుకొన్నారు.

"ఏమండీ ! అమ్మాయిని కొంచెంపిలుస్తారా " అన్నాడు పెళ్ళిపెత్తనాని కొచ్చిన ఒకపెద్దమనిషి. కాల విలంబన మెందుకని 'దానికేం' అనిరావుగారు లేచి, అప్పటికే ముస్తాబై తయారుగానున్న కూతూర్ని తీసుకరమ్మని, భార్యతో అని తిరిగివచ్చేసాడు. కొంత సేపటికి ముందుతల్లి, వెనుక అమ్మాయి వచ్చి అక్కడ తిన్నగా కూర్చొన్నారు. పెళ్ళివాళ్ళంతా కళ్లుపెద్దవి చేసి బాగా పరిశీలించారు. అన్ని విధాలా అమ్మాయి నచ్చినట్లేనని వారి ముఖ చిహ్నాలుపట్టి కనిపెట్టొచ్చు.

"అమ్మాయికి సంగీత మేదయినా వచ్చా? "

"ఆ, ఏదో కాస్త నేర్చుకున్నదండీ. వీణకూడ వాయిస్తుంది. ఏదీ ఒక పాటపాడమ్మా ! " అని రావుగారంటూండగనే గోపీ వీణ తెచ్చి చెల్లెలికందించాడు. అమ్మాయి మొదట కొంచెం సందేహించి సిగ్గుపడ్డా "పరవాలేదు పాడమ్మా" అన్న తండ్రి వాక్యాలతో కొంచెం ధైర్యం తెచ్చుకొని, వీణమీటి రాగాలాపనచేసి త్యాగరాజు కృతి నొకదానినందుకొంది. ఆమె మృదువైన వేళ్ళతో వీణమీటుతూ కమ్మనికంఠంతో పాడ్తూంటే, స్వర్గసీమలో తేలియాడునట్లు తన్మయుడయాడు రఘు. ఆమె పాటనిలిపి వెళ్ళి పదినిమిషాలైనా పాటమాత్రం రఘు చెవుల్లో గింగురుమంటూనే ఉంది. పెళ్ళివాళ్లు చాల సంతోషించారు.

"అమ్మాయి అన్ని విధాలానచ్చింది. మరి మా అబ్బాయికూడ ఒప్పుకొన్నట్లే. అయితే...వాడుపై చదువులు చదవాలని చాల అభిలాషపడ్తున్నాడు. ఇప్పటికే మా పనయిపోయింది. ఎల్లాగో కష్టపడి "ఇంటర్" దాకా చదివించాము; "చదువుచాలు బాబూ" అంటే వాడువినేట్టులేదు. దానికేదైనా కొంచెం సహాయం చేస్తే బాగుంటుంది. " అని తన అభిప్రాయాన్నంతా ఒకగుక్కలోచెప్పేసాడు పెళ్ళిపెత్తనానికొచ్చిన పెద్దమనిషి. ఇవన్నీ వింటూన్న రావుగారి గుండెలు నీరైపోయాయి. ఏమి మాట్లాడాలో తెలియడంలా. ఎట్లో మాటతెచ్చుకొని "దానికేం చెయమన్నారండీ"అన్నారు రావుగారు.

"ఆ...మీకు తెలియందేముందండీ. చదువుకొన్నవారు, పదిమందిలో మెలిగినవారు. చూడండీ-ఎంత సర్దుబాటు చేసుకొన్నా కనీసం 6, 7, వేలయినా లేందే ఈ కాలంలో బి. ఏ. పూర్తికాదు.

అందుకని మీరేదైనా......ఒక ఐదువేలిచ్చారంటే, మిగతదెట్లో మేంసర్దుకొంటాం"

రావుగారికి గుండె ఆగిపోయేటంతపనైంది. ఒక్కకానీరైన చేతిలోలేని బడిపంతులు ఐదువేలెట్లిస్తాడు! ఇవ్వకపోతే కూతురి పెండ్లినాశనం. అందులో ఇప్పుడొచ్చింది నాలుగోసంబంధం. ఇదికూడ తప్పిపోతే తనకూతురుగతేంకావాలి? అయితే ఐదువేలివ్వడం ఎట్లా? ఈ ఆలోచనలన్నీ అతని తలలో రైళ్ళు పరిగెత్తినై. ఎట్లాగోమనస్సును చిక్కపట్టుకొని ఇవ్వకతప్పదుగదాయని.

"ఏమండీ, ఐదువేల సొమ్మెచ్చటనుండి ఇవ్వగలం? ఏదో ఒక రెండువేలైనా, ఏలాగో ఒకలాగు సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తాం. అంతకు మించి మీరడగటం.........." అంటుండగనే మధ్యలో "అయితే లాభంలేదండీ. దానికి తక్కువైతే ఆలోచించాల్సిందే. అమ్మాయి మాత్రం చాలా బాగుంది. అయితేమాత్రం......ఆలోచించండి రావుగారూ!"

"ఆలోచించడమేముందండీ. ఐదు వేలివ్వడం అసాధ్యమేననుకొంటాను"

"అయితే మేం వెళ్ళొస్తామండీ"

"వెళ్తారా.........."

"వెళ్ళకేం చెయమంటారండీ" అంటూ పెళ్ళివాళ్ళందరూ లేచి చెప్పకుండానే కట్నప్రవాహంలో పడికొట్టుకుపోయారు. రావుగారు నిశ్చేష్టుడై అట్లే కూర్చుండి పోయారు లేవడానిక్కూడా శక్తిలేకుండా. తలుపుచాటునుండి ఇదంతా చూస్తున్న "కమల" కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. గబుక్కన రెండు చేతుల్లో ముఖంమూసుకొని అచటనుంచోలేక వెళ్ళిపోయింది. పాపం అంతకంటే ఆమె చేయగలదేముంది? ఇదంతా చూస్తున్న రఘుకు మతిపోయినట్లైంది. ఇంక అచటకూర్చోలేక తిన్నగా ఇంటికొచ్చి కుర్చీలోకూలపడ్డాడేగానీ, మనస్సు కుదుటబడలేదు. సంఘంలోని దురాచారాన్ని, ధనాశల్ని తలచుకోగానే అతని హృదయం బరువెక్కింది. "పాడుసంఘం ఏవేవో

ఒక కేసు విచారణ సందర్భమున జడ్జి ప్రతివాదిని "గడచిన ఆరునెలల కాలంలో నీవు భార్యతో మాట్లాడకుండాయున్నది నిజమేనా" అని అడిగాడు.

"నిజమేనండీ; ఆమె ధోరణికి అంతరాయం కలిగించడం నా కిష్టంలేకపోయింది"

ఆచారాల్ని చట్టాల్ని కల్పించి అమాయకులైన ప్రజలను కష్టాలకుగురిచేసింది. ఎవరోకొందరు స్వార్థపరులు, స్వలాభాలకై, వరకట్నాది దురాచారాల్ని సంఘంలో ప్రవేశపెట్టి, ఎంతమంది నిండు జీవితాల్ని, సౌఖ్యాల్ని పాడుచేస్తున్నారు! అందులో మన దేశంలో స్త్రీల విషయం తల్చుకొంటే కడుపు తరుక్కుపోతోంది. వాళ్ళకి జరిగే వన్నీ అన్యాయాలే. విద్యా, బుద్ధీ, అందం, కలిగుండీకూడ డబ్బులేదన్న సాకుతో కమలలాంటి అమాయిక జీవితాలు నాశనం కావల్సిందేనా? ఆకంఠ మాధుర్యం, యవ్వనం, అందం కరిగిపోవాల్సిందేనా? పోనీ కమలను పెళ్ళిచేసుకొంటే......ఇలా ఎన్నో ఆలోచనలు అతనిలో పుట్టుకొచ్చినాయి. కడకు ఏమైతేనేం. కమలని పెళ్ళాడ్డానికే నిశ్చయించాడు రఘు. మనస్సు కొంచెం కుదుటబడ్డది.

౩

రావుగారొక గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ హెడ్మాస్టరు. నెలకో అరవైరూపాయల జీతం వస్తుంది. దాంతో సంసారాన్ని గడుపుకొంటూన్నారు. భార్యా, ముగ్గురు కూతుళ్ళూ, ఒక కొడుకు ఇదే అతని సంసారం. కొడుకు గోపీ బి. ఏ. చదువుతున్నాడు. పెద్ద కూతురు "స్కూల్ ఫైనల్" దాకా చదివి ఇప్పుడింట్లోనేవుంది. సుమారు

పదహారేళ్లుంటాయి. నవ యవ్వనం తొణికిసలాడుతూంది. సుందరాకారమే. ఆమెయే మన పెళ్లికూతురు కమల. ఆమె కిదివఱకు మూడు సంబంధాలొచ్చాయి. ఇప్పుడొచ్చింది నాలుగో సంబంధం. అందఱూ కట్నం విషయంలోనే పేచీపడి పెదవి విఱిచి వెళ్లిపోయారు. కూతురు పెళ్ళి విషయం ఎంతో ప్రయత్నించారు రావుగారు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఇక కూతురికి పెళ్ళి కాదనే నిశ్చయించుకొన్నారు పాపం వారు. రఘు మిక్కిలి ధనవంతుడు కాకపోయినా కొంచెం పైతరగతివాడు. బి. ఏ. ఎల్. టి. ప్యాసయి వేసవి సెలవుల్లో, మేనమామగారి గ్రామానికదే మొదటిసారిగా వచ్చాడు. అది కొంచెం చిన్న గ్రామం. అందుచే, వార్తాపత్రికలకో, లేక షికారు వెళ్ళటానికో రావుగారింటికి వస్తూండడముచేత, వారికి పరిచయమెక్కువైంది. ప్రతి దినం రఘు, గోపీలుకలిసి షికారు వెళ్ళేవారు. తఱుచు కమల కూడా రఘుతో మాట్లాడ్తుండేది.

పెళ్లివారువెళ్ళి రెండు రోజులయింది. మూడో రోజు సాయంత్రం తన నిశ్చయాన్ని గోపీకి తెలియచేస్తామని గబగబా బయల్దేరాడు రఘు గోపీ యింటికి. అప్పుడే రావుగారు ట్యూషన్‌కు వెళ్ళేరు. ఆయన భార్య పక్కింటికెళ్లింది. ఇంట్లో కమల ఒక్కతేవుంది.

“గోపీ” అంటూ ప్రవేశించాడు రఘు.

“గోపీ బజారు కెళ్లాడండీ. మీరొస్తే కాస్త కూచోమని చెప్పిపోయాడు” అని తలుపుచాటు నుండే జవాబిచ్చింది, అవమానభారంచేత కుమిలిపోతూ కమల. ఇదే సమయమనుకొని రఘు “కమలా” అన్నాడు. కమల ఉలిక్కిపడింది. “కమలా” అన్న పిలుపు ఆమె హృదయంలో ప్రతిధ్వనించింది.

“నేనొకటడుగుతున్నా, కోపించకుండా జవాబిస్తావుకదూ.”

"కోపమెందుకండీ" అన్నది లేని ధైర్యం తెచ్చుకొని కమల.

"హృదయపూర్వకంగా చెప్తున్నావా? అడగొచ్చా?"

"ఊ ... ..."

" ... ... "

" ... ... "

"నిన్ను వివాహమాడ దలచుకొన్నా."

"నన్నా!" అని కమల ఆశ్చర్యంతో ఏమో చెప్పదలచుకొంటుండగనే గోపీ ప్రవేశించాడు. జవాబివ్వకుండానే లోపలి కెళ్లింది కమల. గోపీ, రఘూలు కలిసి షికారు వెళ్లారు.

కమల ఆ రాత్రే ఈ విషయం వాళ్ల నాన్నకు చెప్పింది. ఇంకేముంది! రావుగారానందభరితులై వెంటనే రఘూదగ్గఱకెళ్లి అన్నీ నిశ్చయించుకొన్నారు. వారంరోజులకల్లా "కమలా రఘు"ల పెళ్లి అతి వైభవంగా జరిగిపోయింది. ఇప్పుడు రఘు అత్తవారింట్లోనే ఉండి ఉద్యోగంకోసం ఎదురు చూస్తున్నాడు. అనుకొన్నట్టుగానే మరో వారం రోజులకల్లా వచ్చింది ఉద్యోగం. ఆ సంతోషంతో "వచ్చిందండీ, వచ్చిందీ" అని పాడుకొంటూ కమల గదిలో ప్రవేశించాడు రఘు.

"ఏమిటండీ వచ్చింది" అనింది కమల.

"ఏమొచ్చిందో కనుక్కో చూద్దాం."

"నాకు జోస్యము తెలీదండీ" అన్నది నవ్వుతూ కమల.

"ఉద్యోగం వచ్చింది" అన్నాడు వొయ్యారంగా.

"ఉద్యోగమే! ఏ ముద్యోగమండీ?"

"స్కూళ్ళ డెప్యూటీ ఇనస్పెక్టరు"

"అయితే! ఇంకేం. మా నాన్నపై అధికారం చలాయిస్తారన్నమాట!"

"ఆ. అవును. నేను మీ నాన్నపైన. నీవు నాపైన" ఇద్దరూ కిలకిల నవ్వుకొన్నారు. టేబిల్ పైనున్న అలారం టైమ్‌పీస్ గణగణా మ్రోగింది ఆమోదాన్ని తెలియచేస్తూ. వారి నవ్వులు దానిలో లీనమైనాయ్.

"డాక్టర్ గారూ! నాకు ఆరోగ్యం చక్కబడుతుందని గట్టిగా నమ్మితే జబ్బు నయమగుతుందని కదూ మీ యభిప్రాయం."

"అవునమ్మా."

"అయితే మేము మీకు డబ్బిచ్చేవాలమని మీరు నమ్మితే మేము మీకిస్తామనేది ఖాయమేకదండీ!"

"అదెలాగవుతుంది"

"నమ్మకమనేది మీకొకలాగ, మాకొకలాగుంటుందేమిటి"

"వ్యాధిస్వస్థత పట్లయుండే నమ్మకమునకు, మీ యడల నాకుండే నమ్మకమునకు బేధమున్నది"

♦ ♦ ♦

"ఏమండీ! మా చెల్లెలికి పంపిన మందుల పార్శలులోని సీసాలన్నీ పగిలిపోయినవని జాబువచ్చింది. పంపేటప్పుడు పై భాగాన్ని సూచించే కాగితాన్ని పెట్టె పైభాగమున అతికించారా"

"సందేహమేమిటి! —ఒకటికాదు — పెట్టె నలువైపులా అతికించాను"